# ఎవరిది?

అతని మాటలు విని దొరగారు మండిపడ్డారు. ఇంతవర కెప్పుడూ ఊహించలేదు. ఇంతకాలంనుంచీ తన నీడను జీవనం చేస్తున్న మనిషి లేశమైనా విశ్వాసంలేకుండా ఈ విధంగా ఇంత సాహసంతో అంటాడని అనుకోనేలేదు. ఎందుకింత పొగరుబోతుతనం, ఇంత తలబిరుసుతనం? ముసలివాడు పోనీ, ఏమైనా మతితప్పి మాట్లాడాడేమో అనుకుందామా? తలుచుకున్న కొద్దీ మితిలేని ఆగ్రహం చెలరేగుతోంది. ఇదంతా కాలంలోవుంది... కాకపోతే ఏమిటి? సింహాద్రి అంతటి వృద్ధుడికి, నమ్మకస్తుడికి ఇంత విపరీతబుద్ధి పుట్టటం?

దొరగారు సింహంలాగా 'ఎవరికోసం వదులుతావ్? నీ తాతల్లాంటి వాళ్ళని చూశా' అని గర్జించి అరుగుమీది నుంచి లేచి ఇంట్లోకి వెళ్ళిపోయాడు. సింహాద్రి పిడుగుదెబ్బ తిన్నవాడిలాగా అక్కడే కూలబడి పోయాడు. గుండెగడగడ వణుకుతోంది. కళ్ళు గిర్రున తిరుగుతున్నయ్. ఆకాశమంతా ముక్కలు ముక్కలై నెత్తిన పడుతున్నట్లుంది... చుట్టూ వున్న ప్రపంచమంతా ఒక్క పెనుగాలికి మూల్గుతూ కుంగి పోతున్నట్లు, తన చుట్టు గుడిసె గజగజ వణికి నేలకి అణగారుతున్నట్లు...నిర్జీవుడిలాగా...మెల్లిగా లేచి బరువుగా అడుగులు వేసుకుంటూ తుపానులో గూడుకూలిన పక్షిలాగా నడిచి ఇల్లుచేరుకున్నాడు. దూరాన్నుంచే మనమడు 'తాతా' అని చప్పట్లు చరుస్తూ తప్పటడుగుల్తో పరుగెత్తుకు వచ్చాడు.

'అంబా' అంటూ గంతులేస్తున్న లేగదూడ దగ్గరికివచ్చి బెదురుతూ నిలబడింది. సింహాద్రి విగ్రహంలాగా కూలబడి పోయాడు గొడ్లపాకలో. గుండెల్ని పగలగొట్టుకుంటూ ఆక్రోశం వెలువడుతోంది. ఈగుడిసె, ఈపాక, ఈ పశువులు ఇంక ఏ నీడలో నిలబడతయ్? ఇంక ఈజగత్తులో ఏఆధారం చూసుకుని తాను తన కుటుంబంతో జీవించగలడు? ముసలి కళ్ళలోంచి జలజల నీళ్లు రాలుతున్నయ్. మనమడు తెల్ల పోతూ చూశాడు తాత కేసి ...తన కన్నీళ్ళలో జగత్తంతా గిరగిర తిరిగిపోతున్నట్లుంది.

కూతురువచ్చి పిలిచింది. కోడళ్ళువచ్చి బ్రతిమాలారు. కొడుకులు దగ్గరకు వచ్చి పిలిచారు. మనమడు తాతచేతులు పుచ్చుకుని రమ్మని లాగుతున్నాడు. కాని సింహాద్రి కదల లేదు. వీరంతా తనని దేనికి బ్రతిమాలుతున్నారో ... ఆ అన్నం ఇక తన కెక్కడిదీ లోకంలో? మూరుగా వెక్కి వెక్కి ఏడ్చాడు. పనిచేసి అలసివచ్చిన కొడుకులు కొంచెం చిరా కుగా అన్నారు–'ఏంకొంపమునిగింది?' సింహాద్రి ఏడుపు ఆపు కోలేక తడబడతూ అన్నాడు 'మునిగింది. ఇంకెక్కడి కొంప? కూలిపోతూంది...'

'ఏమిటి?'

'నాయనో...చెప్పలేను... ఇక మనకొంప కూలిపో తుంది... మనం పక్షుల్లాగా అల్లాడిపోతాం ... నాయనా గుండె చెరువౌతోంది'

కూతురు దగ్గరికివచ్చి మెల్లిగా అడిగింది 'ఏమిటి బాబూ?'

'ఇంకేంబాబు తల్లీ... అంతా అయిపోతోంది, మన అన్నం...మన జీవనం...'

దొరగారు కబురు పంపాడు. సింహాద్రి గబగబా వెళ్ళాడు. దణ్ణంపెట్టి కూచున్నాడో లేదో పిడుగులాంటి మాట... సింహాద్రి ఆపాదమస్తకమూ గజగజ వణికింది. అమాంతం దొరగారి పాదాలు పుచ్చుకున్నాడు. వొణికిపో తున్న గొంతుతో 'బాబూ చంపెయ్యకండి... నా అన్నం బోర్లతొయ్యకండి. బాబూ నాకొంప కూల్చకండి' అన్నాడు. దొరగారు 'వీల్లేదు...వీల్లేదు...సొంతవ్యవసాయం చేస్తాను.'

'బాబూ... మీ పాదాల దగ్గర బతుకుతున్నాం... ఒక్కసారిగా నోట్లో మట్టికొడతారా స్వామీ?'

'మారుచెప్పటానికి వీల్లేదు. పొలం వదిలెయ్యాల్సిందే'

సింహాద్రి కూలబడిపోయాడు మాటలేకుండా. దుఃఖం పొంగుకొస్తోంది. దొరగారు

'ఎల్లుండి మా నాగళ్లు పంపుతున్నాను' సింహాద్రి అప్రయత్నంగా 'నాఘటం వుండగానే?' దొరగారు నుండి పడ్డాడు.

కాని సింహాద్రికి మనసుమనసులో లేదు. నిజం... తన ఘటం వుండగానే తనని ఆచేలోనుంచి తొలగించటం... ఎవ

రికీ శక్యం కాదు...కాదు! మరుపు మాయమైపోయి ఎన్నో ఎన్నో తలపుకొస్తున్నయ్...తన జీవితంలో ఇన్నేళ్ళూ ఆ తల్లి చలవలో క్షణాలలాగా గడిచిపోయినయ్. ఆ తల్లినే ప్రతిక్షణమూ మనసులో మొక్కుకుంటున్నాడు. ఆతల్లే తన నింతవరకూ బిడ్డలాగా కాపాడింది...తను కాటకానికి భయపడి ఇరవై రెండో యేట ఎంతో దూరంనుంచి భార్యతో వచ్చి ఈ ఊరు చేరటం... అప్పటి ఊరికీ ఇప్పటిఊరికీ ఎంత భేదం!

భార్య తలపుకురాగానే గుండె భగ్గుమంది. ఆమెతనకి ఈలోకంలో దొరికిన దేవత... ఆ ఊరు చేరగానే మొదట ఆమె ఒక శాస్త్రులుగారింట్లో పనిచేసేందుకు కుదిరింది. వారింట్లోనే ఒక చిన్నపాకా వేసుకుని సింహాద్రి కాపురం పెట్టాడు. భార్య రెక్కల కష్టం మీదనే బ్రతకలేక తనుకూడా కూలికి వెళ్ళి...దినాలు క్షణాలలాగా గడిచిపోతున్నయ్. అప్పుడు అతనికి బ్రతుకంతా ఎంతో ఆనందంగా గడిచిపోతోంది. వయసులోవున్న అతనిభార్య జగత్తులోని సుఖాన్ని, సంతోషాన్ని తనరూపంలో మేళవించి అతని జీవితాన్ని కలలో వున్నట్లుగా చేసేది. వాళ్ళిద్దరూ ఒక్కనాడూ పోట్లాడుకోలేదు...ఆదినాలు తలుచుకున్నకొద్దీ కడుపుతరుక్కుపోతోంది. ఒకనాడు శాస్త్రులుగారు 'సింహాద్రీ ఏం చేస్తున్నావ్?' అని అడిగారు. సింహాద్రి 'ఏంలేదు స్వామీ' అని వినయంగా చెప్పాడు. సింహాద్రిని వెంటబెట్టుకుని శాస్త్రులుగారు ఊరిబైట ఉన్న ఒకదిబ్బమీదికి తీసికెళ్ళి 'సింహాద్రీ దీనిమీద ఏమైనా పండించుకోరాదూ? ఊరికే నే వుంటోంది'

ఆ ఊహే సింహాద్రి మనస్సుకి అపూర్వఆనందాన్ని చ్చింది. అతని మనస్సు ఉప్పొంగిపోయింది తొలకరిచినుకులకు నెర్రలిచ్చిన నేలలాగా. "బాబా...బతికించారు. మీ పేరు చెప్పుకునే గూట్లోదీపం, నోట్లోముద్దా!"

ఆక్షణంనుంచే సింహాద్రి సింహంలాగా ఆదిబ్బనంతా పలుగుతో తవ్వాడు. చెమటలు ధారలు కట్టినయ్. బెండ గింజలు చల్లాడు. చెరువునీళ్ళు మోసుకువచ్చి పోశాడు. మొక్కనాటుకునే అదనున మంచి వర్షం కురిసింది. సింహాద్రి ఉప్పొంగి పోయాడు; శాస్త్రుల్లుగారు చూపించిన ఈదోవకి భగవంతుడుకూడా తోడ్పడుతున్నాడని. అతనూ భార్యా పని అయినవెంటనే బెండతోటకుపోయి అస్తమానమూ తోటలోనే కుదుళ్లుచేస్తూనో, నీళ్ళుపోస్తూనో, చీడ పట్టిన ఆకుల్ని తుంచివేస్తూనే గడిపేవాళ్ళు. మొక్కలన్నీ కాయలతో వొంగిపోయినయ్. ఆతోటకేసి చూస్తుంటే సింహాద్రికి తోచింది మన పాదాలక్రింద నిద్రపోయే ఈ భూమిలో ఒకచల్లటి తల్లి దాగివున్నదని ఆమే తనని చేతు లెత్తి దీవిస్తున్నదని! శాస్త్రుల్లుగారి కుటుంబం లేకపోతే తనూ తన భార్యా పక్షులమైపోయేవాళ్ళమని గ్రహించాడు. అను క్షణమూ శాస్త్రుల్లుగారికి మనస్సులో దణ్ణం పెట్టేవాడు. ఆయన పిల్లలంతా తన భార్య చేతుల్లోనూ, తన చేతుల్లోనూ పెరిగి పెద్దవాళ్ళయారు...

మరొక ఏడు జొన్న వేశాడు. అడవిలాగా పెరిగింది. గాలికి కదులుతూ మోతచేసే ఆకులలో అతని హృదయం

కూడ కలిసి గంతులేసింది. భూదేవి చలువకి వెయ్యిదణ్ణాలు పెడుతూ...దినాలు గడిచినయ్. సింహాద్రి, భార్య దుర్గమ్మా తమశక్తినంతా ఆనేలమీద ధారపోశారు. సింహాద్రి యువక రక్తమంతా, కండల పటుత్వమంతా ఆపొలానికే చిరునవ్వుతో అర్పించాడు. శాస్త్రుల్లుగారు ఎంతో శ్రమపడి ఆచేను ఆయకట్టులో చేర్పించారు. ఆయేటినుంచీ ఆచేలోవరి ఉన్మత్త నర్తన మారంభించింది. ఊడ్పుల రోజులన్నీ సింహాద్రి పొలం గట్టునే గడిపేవాడు. భార్య గడ్డికోసుకెళ్ళటానికి వచ్చేది. ఇవతలి గట్టునకోసి మోపుకట్టి అవతలి గట్టున కన్నం చూసి రావటానికి వెళ్ళేవాడు. ఇంతలో దుర్గమ్మ చప్పట్లుచరిచి పిలిచేది. "ఏది నువ్వుకోసినమోపు? దొంగలు!" సింహాద్రి గబగబా వచ్చేవాడు. 'ఏమైపోతుంది? ఇప్పుడేగా' అంటూ. దుర్గమ్మ దగ్గరకి వచ్చాక సింహాద్రి ముఖంలోకి చూసి ఫక్కున నవ్వేది. అన్నివైపులా మోపుకోసం వెదికి చివరికి బోదెలో తేలిపోతున్న గడ్డిమోపుని చూసి 'ఓసి టక్కరు దానా!' అని నవ్వుతూ వెళ్ళిపోయేవాడు. ఆకాలం తలుపుకు రాగానే ఏదోఒక చల్లటిగాలి తాకినట్లుంది.

తొలకరివానలు దిగినాక నాగలి కట్టాక నేలలోంచి వచ్చే సుగంధంతో ఆచల్లటితల్లి ఆశీర్వదిస్తోందని మురిసిపోయేవాడు. వరినాటుకుని దుబ్బచేసి, ఉదయాన మంచుబిందువులతో కదిలి ఆడుతుంటే అతని ఒళ్ళు మరిచిపోయేవాడు. వరి కంకులు గాలిలో అటుఇటు కదులుతూ అంతటా బంగారపు కాంతులు మెరుస్తుంటే సింహాద్రి చేతులెత్తి భూదేవికీ శాస్త్రుల్లుగారికీ దణ్ణం పెట్టేవాడు ఎన్నోసార్లు. కుప్పనూర్పిడి

అయిపోయి రాసి తయారైనాక అతనిగుండె సంతోషంతో గబగబలాడేది.

భార్యతో ఎన్నోసార్లు చెప్పాడు 'దుర్గీ! ఆతల్లి బువ్వ పెడుతోంది మనకి. కంటికి రెప్పలాగా కాపాడుతోంది.' భార్య అనేది 'ఆతల్లి చలవలేకపోతే ఈపాటికి మనం ఎక్కడుండేవాళ్ళం?'

స్మృతి చక్రం ఇంకాగిర్రున తిరిగిపోతోంది. తనూతన భార్యా ఆచేలలో గడిపిన దినాలు...తన పెద్దకొడుకు పుట్టిన రోజు కంకులు విడుస్తూ మంచుని వెదజల్లుతూ చల్లగాలిలో ఒయ్యారంగా కదులుతున్న వరితో తన ఆనందంతో కలిసి తేలుతున్నట్లు...ఉప్పొంగిపోయాడు. కలిగిన సంతానమంతా ఆపొలంలోనే కష్టపడి ఆమె చలువలోనే పెరిగి పెద్దవా రయ్యారు. సింహాద్రి గట్టుమీద నిలబడి ఎన్నోసార్లు పరవశు డైపోతూ అనుకునేవాడు తానొక పసిపిల్లడై పారాడుతు న్నట్లు...ధాత్రి తల్లివలె తనను చల్లటి చేతులతో ఎత్తుకుని ముద్దాడుతున్నట్లు! ఆమె చేతులతో సౌభాగ్యాన్ని అతనిమీద విరజిమ్ముతున్నట్లు! అప్రయత్నంగా అతని మనస్సుని తొలు చుకుని 'తల్లీ!' అని వెలువడేది. ఆనందంతో కనుకొలుకుల్లో నీళ్ళు తొణికేవి...అప్పుడు బ్రతుకులో లేదనేమాట లేదు. గుడిసెఅంతా ధాన్యంతో కలకలలాడేది. ఇంటి చుట్టూ కోళ్లు కూస్తూ తిరుగుతుండేవి. పాకలో మోరలెత్తి ఎద్లు రంకెలు వేస్తుండేవి. పిల్లలు కట్టిన మువ్వలని ఝల్లుమనిపిస్తూ లేగ దూడలు చిందులుతొక్కుతుండేవి. సింహాద్రికి మరీ రూఢి

అయిపోయింది. కాటకానికి తాళలేక వచ్చిన ఈదిక్కులేని దంపతులను తన బిడ్డలలాగా కౌగలించుకుని దీవించిన ఆతల్లి కరుణే ఇదంతా అని. ఆమెకి ఈదయ కలగకపోతే తానేమై పోయేవాడో ఊహించుకొంటే గుండె నీరైపోతుంది. ఇంత సంతోషంలోనూ శాస్త్రుల్లుగారిని తలచుకోని క్షణంకాని, వారి ఇంటికి వెళ్ళి దణ్ణం పెట్టిరాని దినంకాని, లేదు! తలుచు కుంటే అప్పటి ఊరే వేరుగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా సిరి చిందులుతొక్కుతూ కనిపించేది. ఇంకా ఉదయకాంతులు ఆవరించకమునుపే చెరువు రేవులో పెద్దదొరలంతా స్నానం చేసి సంధ్యావందనం చేస్తూవుండేవారు! వేదమంత్రాలు దిన మంతా ప్రతిధ్వనించేవి. సాయంతనం దేవాలయంలో రామ శాస్త్రుల్లుగారు పురాణం చెపుతుంటే పక్షులు నిలబడి ఆలకిం చేవి. రాత్రి శూద్రులంతా నిద్రకుమళ్ళినాక అవధాన్లుగారు దాశరథీశతకం చదువుతుంటే కంచుగంటలు మోగినట్లుగా వుండేది. ప్రతిగడపా తోరణాలతోనూ, తీర్చిదిద్దిన ముగ్గుల తోనూ సంపదలు ఆహ్వానిస్తున్నట్లుగా వుండేది.

ఆరోజులన్నీ కలలాగా పరుగులెత్తినయ్. నిజం ఇప్పటి దినాలతో పోల్చితే కలలాగా కానవస్తున్నయ్.

తరువాత ఊళ్ళో పెద్దఘటాలు ఒక్కొక్కరూ వెళ్ళి పోయారు. తండ్రులమాదిరి పిలకలు లేకుండా, సంధ్యావందనం లేకుండా, ఇంగ్లీషు చదువులు చదువుకొచ్చిన చిన్నదొర లంతా పెత్తనం ఆరంభించారు. సింహాద్రి అదిరిపోయాడు ఈమార్పు చూసి. ఊరునుంచి సిరికూడా తొలగిపోతుం

దేమోనని భయపడ్డాడు. ఇంతలో దేవుడిలాంటి శాస్త్రుల్లు గారుకూడా లోకంనుంచి దాటిపోయారు. అతనికళ్ళు చీకట్లు కమ్మినట్లైనయ్. సింహాద్రీ, దుర్గమ్మా తమ తండ్రి పోయిన కన్నా ఎక్కువగా ఏడ్చారు....

దినాలు గిర్రున తిరిగినయ్. గ్రామమంతా మారిపోతోంది. వేదమంత్రాలు లేవు...పురాణాలు లేవు, సంధ్యావందనం లేదు.. భూదేవికి కోపంవచ్చిందేమోనని బెదిరిపోయాడు సింహాద్రి ఆయేటిపంటచూసి, శాస్త్రుల్లుగారికొడుకుకి- ఇప్పుడు పెద్దచదువు చదివివచ్చాడు. చిన్నప్పుడు తన చేతులలో ఎదిగాడు- కట్టుబడికొలవగా తన కేం మిగిలింది? తనూ, తన పిల్లలూ బ్రతికేదెల్లా?...అరుగుమీద కూచుని ప్రొద్దున్నే స్నానం లేకుండా కాఫీ పానం చేస్తున్న చిన్న దొరగారిని వెళ్ళి బ్రతిమాలుకున్నాడు కట్టుబడితగ్గించండని. ఆయనతండ్రి గారు తన నెల్లా బిడ్డలాగా ఆదరించారో ఈయన అంత అనాదరంగా చూడటం ఆరంభించాడు.

ఇంతలో...కలరా! అపిశాచమే సింహాద్రి కొంప కూల్చింది. ఊరిలో మిగిలిఉన్న సిరిసికాస్తా తన కాళ్ళకింద మట్టగించింది. ప్రతియింటినుంచీ పీనుగులని లేపింది. సింహాద్రి కుంగిపోయాడు, నేలకి అణిగి పోయాడు. కూతురు, కొడుకు, భార్యా...శోకాలు పెడుతూ తల నేలకేసి బాదుకున్నాడు- 'నన్నుకూడా తీసుకుపో' అని. ఇంతకాలమూ అతనికి తోడుగా నిలిచిన భార్యకూడా పోవటంతో రెక్కలు విరిగిన పక్షిలాగా...ఇంతకాలమూ తన సుఖదుఃఖాలును సమంగా

మోసింది. ఇక ఈ దుఃఖమంతా ఒంటరిగా ఎల్లా భరించటం! గుండె చెదిరిపోయింది. అతని మనస్సు విరిగిపోయింది. శక్తి చచ్చిపోయింది. చావలేక బొమ్మలాగా బ్రతికి వున్నాడు.

గుడ్లలో నీళ్ళు చిందుతుంటే చేనుగట్టుకి వెళ్ళాడు. పొలమంతా రాత్రికురిసిన మంచులో నిశ్శబ్దంగా... నిశ్చలంగా అతనితోపాటు విలపిస్తున్నట్లుంది. నిలవలేక 'తల్లీ!' అని ఒక పెద్దశోకంతో గట్టున చతికిలబడిపోయాడు.

'దొరగారు రమ్మంటున్నారు నిన్ను'

సింహాద్రి ఏమీ మాట్లాడలేదు. కొడుకులు వచ్చి వెళ్ళమని బలవంతం చేశారు. సింహాద్రి కదలలేదు. కొడుకులిద్దరూ వెళ్ళారు.

ఇంతకాలమూ ఏ తల్లి తనని చల్లగాదీవించిందో, ఏ తల్లి కంటికి రెప్పగా కాపాడి సుఖంలో ముంచి తేల్చిందో, ఏతల్లి తనకి నీడగా నిలిచి తన చేతులెత్తి బ్రతుకునంతా ఆనందంతో నింపిందో, ఏతల్లి అతని కుటుంబంమీద దయను వర్షించిందో, ఏతల్లి తన సుఖదుఃఖాలలో తనకి తోడై నిల్చిందో...

సింహాద్రిగుండె చెరువౌతోంది... 'తల్లి! నిన్నెలా వదలగలను? పరాయివాడిలాగా తొలగిపోగలను?' కన్నీళ్ళు వర్షం కురుస్తున్నయ్. ఆ కన్నీళ్ళలో ఒక మహాద్భుతమైన మూర్తి ఒకచేతిలో బంగరుకలశం ధరించి ఒక చేతితో అతనిమీద సిరిని వెదజల్లుతున్నట్లు... శ్యామలచేల సంశోభితమై, వివిధపుష్పరాసులతో అలంకరించుకుని దీర్ఘ కరము

లందు ధరించిన సస్యసమృద్ధిని అతనిపై వర్షం కురిపిస్తున్నట్లు... దిక్కులేక నిలిచిన తన్ను తన ఒడి జేర్చి చల్లటి చేతితో నిమిరినట్లు...ఎన్నో ఊహాలతో పులకరించిపోయాడు. భూదేవి కళ్ళనుంచి వెడలిన కరుణకాంతులలో పారాడాడు పసిపిల్లడిలాగా...ఇక?

ఇంతలో కొడుకులు తిరిగివచ్చారు. వారి ముఖాలు చూసి సింహాద్రి బేజారయిపోయి ప్రశ్నించాడు 'దేనికి పిలిచారు?' కొడుకులు ఎంతో అవలీలగా చెప్పారు 'మనకెందుకు వారి పొలం వారికే వదిలేద్దాం' అని. సింహాద్రి కూలబడిపోయి గుండెలు బాదుకున్నాడు. 'నా ఘటం వుండగా...?' ఇంట్లోంచి మాటలు వినబడ్డయ్... 'దొరగారు ఇద్దరికీ చెరి ఒక వందా' సింహాద్రిమీద పిడుగులవర్షం కురిసింది, సుడిగాలిలో ఎండిన ఆకులాగా గిరగిర తిరిగిపోయింది అతని గుండె. ఏతల్లి ఇంతకాలమూ బ్రతికించిందో ఆతల్లినివదిలి...విశ్వాసం లేకుండా పరాయివాళ్ళలాగా వెళ్ళిపోవటానికి లంచం? మనస్సు తుఫానులో కెరటాలలాగా ఉప్పొంగింది. 'ఛీ దుర్మార్గుల్లారా...ఇక మీ ముఖం చూడను' అని అరిచి కర్ర తీసుకుని తూలుతూ, సోలుతూ అడుగులు వేశాడు ... కళ్లు తిరిగిపోతున్నయ్. అప్పటికే దొరగారి నాగళ్ళు చేలో అడుగు పెట్టినయ్. సింహాద్రి లేనిశక్తిని తెచ్చుకుని పరిగెత్తి దున్నిన మట్టిని గుప్పెళ్ళతో తీసి కళ్ళకద్దుకుంటూ అడ్డంగా పడుకున్నాడు. నాగళ్ళు ఆపారు. గట్టుమీద నిలబడ్డ దొరగారు గబగబ వచ్చి 'ఏమిటిది?' అన్నారు. సింహాద్రి దొరగారి పాదాలు

పుచ్చుకుని వొణుకుతున్న కంఠంతో అన్నాడు- 'బాబూ! ఈ తల్లి ఒళ్ళో బ్రతికాను... ఈతల్లి ఒళ్ళోనే నన్ను చావ నివ్వండి'

నిలువుగుడ్లుపడ్డయ్. మట్టితోవున్న గుప్పెళ్ళు బిగిసి పోయినయ్.

దొరగారు అప్రయత్నంగా కన్నీళ్ళతో 'సింహాద్రీ!' అని పిలిచాడు. చిన్నప్పుడు తనని వీపుమీద గుఱ్ఱంలాగా ఎక్కించుకుని తిరిగిన రోజులన్నీ కళ్ళముందు గిర్రున తిరిగి నయ్. "ఎవరిది? ఈ పొలం ఎవరిది?" అనే ప్రశ్న గుండెల్లో మెరుపులాగా దూసుకుపోయింది.

—★—